



సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు



తిరుగు రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

నేత్రపర్వంగా తిరుగు రథయాత్ర

టర్నర్‌చౌల్ట్రీ నుంచి ఆలయానికి చేరుకున్న జగన్నాథుడు

- వర్షంలోనూ ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు

మహరాణిపేట, జూలై 18: జగన్నాథ స్వామి తిరుగు రథయాత్ర గురువారం నేత్రపర్వంగా సాగింది. టర్నర్ చౌల్ట్రీలో గత పది రోజులుగా కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఉదయం స్వామి విగ్రహాలను రథంపైకి చేర్చి భక్తుల దర్శనాలకు అనుమతించారు. సాయంత్రం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి తిరుగు రథయాత్ర నిర్వహించారు. వేలాదిగా పాల్గొన్న భక్తుల గోవింద నామ స్మరణ, హరినామ సంకీర్తనలు, వేద మంత్రాలతో టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణం మార్మోగింది. టౌన్ కొత్త రోడ్డులోని ఆలయానికి చేరుకోవడంతో రథయాత్ర పరిసమాప్తమయ్యింది. శుక్రవారం సంప్రోక్షణ అనంతరం జగన్నాథ, సుభద్ర, బలభద్రుడి విగ్రహాలను తిరిగి ఆలయంలోకి చేరుస్తారు. రథయాత్రలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఆలయ ఈవో టి.రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ సీఈ పోస్టుకు పైరవీలు

- ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న ప్రస్తుత సీఈ
- ఆ పోస్టు కోసం భారీగా ఆశావహులు
- కూటమి నేతల ద్వారా యత్నాలు
- రేస్‌లో ముగ్గురు సూపరింటెండెంట్ ఇంజనీర్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పోస్టుకు ఆశావహులు పైరవీలు ప్రారంభించారు. ప్రస్తుతం చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రవికృష్ణరాజు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆ పోస్టులోకి వచ్చేందుకు కొందరు, ఇన్‌చార్జి సీఈగా బాధ్యతలు దక్కించుకునేందుకు మరికొందరు యత్నిస్తున్నారు.

రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌గా జీవీఎంసీకి గుర్తింపు ఉంది. ఏటా సుమారు రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు, మరో రూ.500 కోట్ల మేర ప్రాజెక్టులు జరుగుతుంటాయి. ప్రతి అభివృద్ధి పనికి అగ్రిమెంట్ జరిగినప్పుడు, పనులు పూర్తయిన తర్వాత బిల్లులు చేసే సమయంలోనూ ఇంజనీరింగ్ అధికారులకు కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ల రూపంలో భారీగా ఆదాయం సమకూరుతుందనే ప్రచారం ఉంది. మిగిలిన ఇంజనీరింగ్ అధికారులకు తమ పరిధిలో జరిగే పనుల నుంచే కమీషన్లు అందితే, చీఫ్ ఇంజనీర్‌కు మాత్రం నగరంలో జరిగే అన్నిపనుల నుంచి కమీషన్లు అందుతుంటాయని చెబుతుంటారు. దీంతో జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పోస్టుకు డిమాండ్ ఉంటుంది. ప్రస్తుత చీఫ్ ఇంజనీర్ రవికృష్ణరాజు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన తన సర్వీసుని పొడిగించుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు సాగించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారిని తిరిగి కొనసాగించే విధానానికి స్వస్తి పలికింది. ఈ నేపథ్యంలో రవికృష్ణరాజు పోస్టులోకి వచ్చేందుకు కొంతమంది ఉవ్విళ్లూరుతున్నారు. కానీ బదిలీలపై ప్రస్తుతం నిషేధం ఉండడంతో ఇతర ప్రాంతాల్లో చీఫ్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నవారు జీవీఎంసీకి వచ్చేందుకు వీల్లేకుండాపోయింది. దీంతో టిడ్కో చీఫ్ ఇంజనీర్‌గా

... మిగతా 6వ పేజీలో

ఏయూలో ఏం జరుగుతోంది?

ప్రసాదరెడ్డి బృందానికే కీలక పదవులు!

- ఇన్‌చార్జి వీసీగా నియమితులైన శశిభూషణరావు అందులో సభ్యుడే
- ఎమ్మెల్యేలకు చెప్పకుండానే నియామకం
- తెరవెనుక చక్రం తిప్పిన టీడీపీ యువ నాయకుడు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంబంధించి గత నెల రోజులుగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. మొన్నటి వరకు వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి యూనివర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చేశారు. అన్ని విభాగాలను తన మనుషులు, వైసీపీ అనుకూలురుతో నింపేశారు. తప్పనిసరి స్థితిలో పదవికి రాజీనామా చేశారు. ఆయన వెళుతూ వెళుతూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కిశోర్‌ను నియమించారు. ఆయన ప్రసాదరెడ్డి మనిషి. అటువంటి వ్యక్తి నియామకానికి కూటమి ప్రభుత్వం ఎలా అంగీకరించిందన్నది ఇప్పటికీ ఎవరికీ అంతుబట్టడం లేదు. అందులో నుంచి తేరుకోకముందే గురువారం ఇన్‌చార్జి వీసీగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణరావును నియమించడం, ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగిపోయాయి. ఆయన కూడా ప్రసాదరెడ్డి బృందంలో చాలా ప్రధానమైన వ్యక్తి. వీసీ పదవిలో ప్రసాదరెడ్డి ఉంటే ఏమి చేస్తారో... శశిభూషణరావు ఉన్నా అదే చేస్తారనే ప్రచారం క్యాంపస్‌లో ఉంది. ప్రసాదరెడ్డి తన హయాంలో టీడీపీ సానుభూతిపరులైన సిబ్బందిని తీవ్రంగా వేధించారు. బోధన సిబ్బందికి పదోన్నతులు కల్పించకుండా, ఇతర అవకాశాలు ఏమీ దక్కకుండా తొక్కేశారు. ఇప్పుడు



ఏయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శశిభూషణరావు



కూటమి ప్రభుత్వం వచ్చినా అదే పరిస్థితి కొనసాగేలా ఉంది. వీసీ పదవికి ప్రసాదరెడ్డి రాజీనామా చేసిన ఇప్పటికీ యూనివర్సిటీలో ఆయన మాటే వేదంగా సాగుతోంది.

ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్లు ఇద్దరూ ఆయన మనుషులే కావడం గమనార్హం. ఈ నియామకాలకు సంబంధించి పార్టీ అధిష్ఠానం జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలెవరితోను సంప్రతించలేదు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విశాఖ

... మిగతా 6వ పేజీలో

ఏయూ ఇన్‌చార్జి వీసీగా శశిభూషణరావు

- వర్సిటీకి చెందిన మరో ఇద్దరు ప్రొఫెసర్లకు ఇతర వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా అవకాశం



శశిభూషణరావు



డీవీఆర్ మూర్తి



విశ్వనాథకుమార్

- ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీగా డీవీఆర్ మూర్తి
- కడప ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వీసీగా విశ్వనాథకుమార్

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో పలు విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్లను నియమిస్తూ గురువారం ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శశిభూషణరావును నియమించారు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా, ఏయూ

... మిగతా 6వ పేజీలో

పోకిరీల పనిబడతాం

ప్రేమ పేరిట ఎవరైనా వేధిస్తే బాధితులు లేదా వారి తల్లిదండ్రులు నేరుగా నాకు ఫోన్ చేయండి | **నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ**

- వన్‌సైడ్‌లవ్, ఈవ్‌టీజింగ్‌ను తల్లిదండ్రులు తేలిగ్గా తీసుకోవద్దు
- పోస్కో కేసుల్లో నిందితులపై రౌడీషీట్
- నగర బహిష్కరణ అంశంపైనా పరిశీలన
- ప్రత్యేక పార్టీలతో కాలేజీలు, బస్టాపుల్లో నిఘా



విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి):

ప్రేమ పేరిట ఎవరైనా వేధిస్తే బాధితులు లేదా వారి తల్లిదండ్రులు నేరుగా తనకు ఫోన్ చేస్తే రక్షణ కల్పిస్తానని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నగరంలో మహిళల భద్రతకు తాము తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక ఇంటికి వెళ్లి తనను ప్రేమించాలని కత్తితో బెదిరించడంతోపాటు అడ్డుపడిన ఆమె తల్లిపై దాడికి పాల్పడిన యువకుడిని అరెస్టు చేశామన్నారు. నిందితుడు గతంలో అదేబాలికను వేధించిన కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై వచ్చాడన్నారు. ఇంతలోనే మరోసారి దారుణానికి ఒడిగట్టాడన్నారు.

పోస్కో కేసుల్లో జైలుకువెళ్లి బెయిల్‌పై వచ్చిన నిందితులపై ఇకపై నిరంతర నిఘా పెట్టాలని నిర్ణయించామన్నారు. బాలికలను మహిళలను వేధించడం, దాడి చేయడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే భయం అందరిలోనూ కలిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు పోస్కో కేసుల్లోని నిందితులపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. అవసరమైతే నగర బహిష్కరణ చేయడంపైనా పరిశీలిస్తామన్నారు. తమ పిల్లలను ఎవరైనా ప్రేమ పేరిట (వన్‌సైడ్ లవ్) వేధించినా, ఈవ్‌టీజింగ్ చేసినా తల్లిదండ్రులు ఆ విషయాన్ని దాచిపెట్టకుండా వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు లేదంటే తన వాట్సాప్ నంబర్ (7995095799)కు ఫోన్ చేయాలని కోరారు. వెంటనే బాధిత యువతులకు, కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు వేధిస్తున్న వ్యక్తులతోపాటు వారి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేయడం, అవసరమైతే షీట్ ఓపెన్‌చేయడం వంటి చర్యలు తీసుకుంటామన్నారు. అలాకాకుండా పరువు పోతుందని దాచిపెడితే ఆకతాయిల్లో ధైర్యం పెరిగి ఏకంగా కాలేజీకి, ఇంట్లోకి ప్రవేశించి ఏదైనా చేయడానికి వీలుకల్పించినట్టవుతుందన్నారు. ఈ విషయాన్ని తాను పోలీస్ అధికారిగా కాకుండా ఇద్దరు ఆడపిల్లలు కలిగిన ఒక తండ్రిగా చెబుతున్నానన్నారు. పోస్కో కేసుల్లో నిందితులపై ఇకపై నిరంతర నిఘా పెడతామని, ప్రమాదకరమని భావించినవారి డేటా సిద్ధం చేస్తున్నామన్నారు. వారందరిపైనా ముందస్తు చర్యల్లో భాగంగా షీట్స్ తెరుస్తామని సీపీ స్పష్టంచేశారు. కాలేజీలు, పాఠశాలల్లో చదువుతున్న బాలికల భద్రత కోసం ఈనెల ఒకటి నుంచి పోలీస్ శాఖ నుంచి ప్రత్యేక పార్టీలను ప్రవేశపెట్టామన్నారు. ఆ పార్టీల్లో ఉన్న పోలీసులు విద్యార్థుల మాదిరిగానే ఉంటూ వారితో కలిసిపోతారన్నారు. కాలేజీలు, బస్టాపుల్లో అమ్మాయిలను వేధిస్తున్నవారిని, గంజాయి, డ్రగ్స్ వినియోగం, విక్రయం చేస్తున్న వారిని గుర్తించే

... మిగతా 6వ పేజీలో

'హయగ్రీవ'కు గనుల శాఖ షోకాజ్



- అనుమతులు లేకుండా 75,274 క్యూబిక్ మీటర్ల గ్రావెల్, రాయి తవ్వకం
- పదిహేను రోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశం

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి):

ఎండాడ సర్వే నంబరు 92లో గల ఐదెకరాల విస్తీర్ణంలో విల్లాల నిర్మాణం కోసం అనుమతులు లేకుండా కొండను తవ్వి కొంతమేర గ్రావెల్, రాయి బయటకు తరలించిన హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు గనుల శాఖ షోకాజ్ నోటీస్ జారీచేసింది. విల్లాల నిర్మాణం కోసం కొండను తవ్వడానికి గనుల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే ఎటువంటి అనుమతులు తీసుకోలేదు సరికదా...అక్కడ నుంచి కొంత గ్రావెల్, రాయిని బయటకు తరలించారన్న ఫిర్యాదులు రావడంతో ఈనెల 11,12 తేదీల్లో సర్వేయర్ సర్వే నంబరు 92లో సర్వే నిర్వహించారు. మొత్తం 75,274 క్యూబిక్ మీటర్ల గ్రావెల్, రాయి తవ్వినట్టు నిర్ధారించారు. 52,692 క్యూబిక్ మీటర్ల గ్రావెల్, 22,582 క్యూబిక్ మీటర్ల రాయి తవ్వినట్టు తేల్చారు. అందులో 27,437 క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను అక్కడ నుంచి బయటకు తరలించి సమీపంలో ఒకచోట కుప్పగా పోయగా, మిగిలింది అక్కడే నిర్మాణాలకు వినియోగించారు. అనుమతులు లేకుండా తవ్వడం, బయటకు తరలించడంపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని హయగ్రీవ డెవలపర్స్ తరపున జీపీఏ హోల్డర్‌గా ఉన్న గన్నమని వెంకటేశ్వరరావుకు గురువారం గనుల శాఖ అధికారులు షోకాజ్ పంపారు. కాగా నిబంధనల

... మిగతా 6వ పేజీలో

ఇళ్ల నిర్మాణంపై విచారణ?

ప్రభుత్వం యోచన

జగనన్న కాలనీల్లో చేపట్టిన నిర్మాణాల్లో నాణ్యత లేదని ఫిర్యాదులు

- వర్షాలకు కొట్టుకుపోతున్న పునాదులు
- నాసిరకం ఇటుకల వినియోగం
- కాంట్రాక్టర్లు అప్పటి పాలకులకు కావాల్సినవారు కావడంతో అధికారులు కూడా ఏమీ అనలేని పరిస్థితి
- ప్రస్తుతం పనులు నిలిపివేతతో ఇసుక, పిక్క దొంగలపాలు
- తడిసిపోతున్న సిమెంట్, ఇనుము



జగనన్న కాలనీలో వర్షాలకు కొట్టుకుపోయిన పునాదులు

విశాఖపట్నం/సబ్బవరం/ఆనందపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల పేరిట చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతను పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనధికార కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లు నాసిరకంగా ఉన్నాయన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో విచారణ జరపాలని యోచిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాల బాధ్యతలను అస్మదీయులకు అప్పగించడంపైనా దృష్టి పెట్టింది.

విశాఖ జిల్లాలో పలుచోట్ల ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయని, కనీస ప్రమాణాలు పాటించలేదని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం 73 లేఅవుట్‌లలో లక్షకుపైగా ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదించారు. రెండేళ్ల క్రితం మొదలెట్టిన పనులు అనేక అవతకవకలతో జరుగుతున్నాయి. సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం, గంగవరం, నంగినారపాడు కాలనీల్లో నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయి. వర్షాకాలంలో వరదకు పునాదులు పైకి తేలిపోయాయి. మిగిలిన చోట్ల కూడా అదే పరిస్థితి. ఇళ్ల నిర్మాణాల కోసం వినియోగించిన సిమెంట్ ఇటుకలు నాసిరకంగా ఉంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అయినా హౌసింగ్ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు గత ప్రభుత్వానికి దగ్గరవారు కావడంతో అధికారులు కూడా ఏమీ మాట్లాడలేని పరిస్థితి ఏర్పడింది.



తడిసిపోయిన సిమెంట్

ఇదిలావుండగా ఎన్నికల

... మిగతా 6వ పేజీలో

ముసురు

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో నగరంలో గురువారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. నగరం, పరిసరాల్లో జల్లులు పడుతూనే ఉన్నాయి. గురువారం రాత్రి ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని, శుక్ర, శనివారాల్లో కోస్తాలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ నుంచి అతిభారీగా, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. బంగాళాఖాతంలో రుతుపవన కరెంట్ బలంగా ఉన్నందున తీరం వెంబడి గాలులు వీస్తున్నాయని మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.



నేటి నుంచి రాయితీ ధరపై టమాటా

- రైతుబజార్‌లలో కిలో రూ.58కి అమ్మకం
- చిత్తూరు జిల్లాలో కొన్న ధరకే ఇక్కడ విక్రయం

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి):



మార్కెట్‌లో టమాటా ధర భారీగా పెరిగిన నేపథ్యంలో జిల్లా అధికారులు రాయితీపై సరఫరా చేయడానికి చర్యలు చేపట్టారు. చిత్తూరు జిల్లాలో టోకున ఎంత ధరకు అయితే కొనుగోలు చేస్తారో... అదే ధరకు విశాఖపట్నంలోని రైతుబజార్లలో మనిషికి కిలో చొప్పున అందిస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రైతుబజార్లలో కిలో టమాటా రూ.68కి అమ్ముతున్నారని, దాని టోకు ధర చిత్తూరు జిల్లాలో రూ.58గా ఉందని, లాభం, నష్టం లేకుండా కొనుగోలు ధరకే అంటే రూ.58కే శుక్రవారం బజార్లలో విక్రయిస్తామన్నారు. ఈ ధర ఏ రోజుకు ఆరోజు మారుతుందన్నారు. చిత్తూరు జిల్లాలో ఎంతకు కొంటే అదే ధరకు ఇక్కడ ఇస్తామని తెలిపారు.

753 క్రేట్ల టమాటా సిద్ధం

నగరంలోని 13 రైతుబజార్లలో విక్రయించడానికి చిత్తూరు నుంచి 753 క్రేట్ల టమాటాను రప్పించారు. క్రేట్‌కు 24 కిలోలు వస్తాయి. ఎంవీపీ కాలనీ, సీతమ్మధార బజార్లకు 105 క్రేట్లు, గోపాలపట్నం, కంచరపాలెం బజార్లకు 100 క్రేట్లు, పెందుర్తి, మాధవధారకు 60 క్రేట్లు చొప్పున ఇచ్చి, మిగిలిన వాటిని అక్కడి డిమాండ్ ఆధారంగా పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాధవధార, జూలై 18: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్ 2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. మాధవధార బస్టాప్, సీతన్న గార్డెన్స్, ఎంఎస్ఆర్ పార్క్, విద్యానగర్ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో...

సీతమ్మధార: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్, ఏపీఎస్ఈబీ కాలనీ, డాక్టర్ గణేష్ బాబు ఆస్పత్రి, ఏఎస్ఆర్ నగర్, సీతమ్మధార ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన

అల్లిపురం, జూలై 18: విశాఖ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అనిల్‌నీరుకొండ దంత వైద్యశాల సహకారంతో ఆశీల్‌మెట్ట వద్ద నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనంతరం విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.టి.రోహిత, డా.ఎస్.రోషిణి, డా.రీనా, డా.కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జె.గౌరీశంకర్, వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రకాష్, సుభాషిణి పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా కుంభకోణాలమయం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ


సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

మహారాణిపేట, జూలై 18: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలన అంతా కుంభకోణాలమయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కొట్టేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు దోచుకున్నారన్నారు. దీని విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.35,500 కోట్లు ఉంటుందని వివరించారు. విశాఖలో అధికశాతం ప్రభుత్వ భూములు వైసీపీ నాయకులు దోపిడీ చేశారని, ఇళ్ల పట్టాల పేరుపైరూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. అధికారులను బెదిరించి, ప్రభుత్వ భూములను బదిలీ చేయించుకున్నారని, సామంతరాజుల్లా వ్యవహరించి విశాఖను దోచుకున్నారన్నారు. ప్రభుత్వ భూములు, రామానాయుడు స్టూడియో భూములు, దసపల్లా భూములు, సీబీసీ ఎంసీ, హయగ్రీవ భూములను అడ్డదారిలో లాగేసుకున్నారన్నారు. భూ అవకతవకలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతో పాటు అన్యాక్రాంతమైన భూములన్నింటినీ తిరిగి తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి భోగాపురం వరకు గత ప్రభుత్వం ప్రతిపాదించిన మాస్టర్‌ప్లాన్ రహదారిలో జరిగిన అక్రమాలను మ్యాప్‌లో చూపించారు. దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ దేవదాయ శాఖ అధికారి శాంతిని విశాఖ భరించలేకపోయిందని, ఆమె ఇక్కడ పనిచేస్తు న్న సమయంలో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారన్నారు. స్థానిక నేతలు విజయసాయిరెడ్డికి చెప్పినా వినకుండా ఆమెకు వత్తాసు పలికారని, చివరికి సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతోనే ఆమెకు విజయవాడ బదిలీ జరిగిందని వివరించారు. విజయసాయిరెడ్డి తన కుమార్తె పేరుపై విశాఖలో అనేక భూములు బలవంతంగా కొనుగోలు చేశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఎర్నాకుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ చూడాల్సిన సినిమా బ్రహ్మా సో విష్ణు


బ్రహ్మాసో విష్ణు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూలై 18: భగవంతుని ప్రేరణతో సామాన్యుడు మాధవుడిగా ఎలా పరివర్తన చెందాడనే కథాంశంతో బ్రహ్మా సో విష్ణు హిందీ సినిమా తెరకెక్కిందని బ్రహ్మాకుమారీస్ ప్రతినిధి రమ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియాతో మాట్లాడారు. విశాఖలోని బ్రహ్మాకుమారీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో బ్రహ్మాసో విష్ణు హిందీ సినిమాను ఈ నెల 20,21 తేదీల్లో ప్రదర్శిస్తామన్నారు. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా దర్శకుడు ముప్పాలనేని శివ దర్శకత్వంలో సినిమా రూపొందించామన్నారు. గాజువాక లక్ష్మీకాంత్, మధురవాడ కృష్ణా మినీప్లెక్స్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రదర్శన ఉంటుందన్నారు. నటుడు ప్రసన్నకుమార్, బ్రహ్మాకుమారీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు 28న బహుమతుల ప్రదానం

అక్కయ్యపాలెం, జూలై 18: పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకుంటున్న గవర విద్యార్థుల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ఈనెల 28న బహుమతులు ప్రదానం చేస్తామని కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో గురువారం విలేకరుల మావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు కళావాణి విశ్వనాథ కన్వెన్షన్ ఆడిటోరియంలో ఈ నెల 28న బహుమతుల ప్రదానోత్సవ అభినందన సభ నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది 550 మంది దరఖాస్తు చేసుకున్నారని, 80 శాతానికిపైగా మార్కులు సాధించిన వారికి షీల్డ్, నగదు బహుమతి అందిస్తామన్నారు. సమావేశంలో మొల్లేటి కుమారస్వామి, వేగి సత్యనారాయణ, మళ్ల బలరాం, పెంటకోట సంజీవరావు, శరగడం సత్యనారాయణ, పారుపల్లి రవి, మళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని క్లాప్ డ్రైవర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న క్లాప్ వాహనాల డ్రైవర్లు

మర్రిపాలెం, జూలై 18: జోన్ -5 కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లకు, లోడర్స్‌కు జీతాల బకాయిలు తక్షణమే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం విధులు బహిష్కరించి మర్రిపాలెం నరేంద్రనగర్ సమీపంలో నిరసన తెలిపారు. ఈనెల పదో తేదీన చెల్లించాల్సిన జీతాలు ఇప్పటివరకు అందలేదన్నారు. ఆరు నెలలుగా ఇదే జీతాలు చెల్లించడంలేదని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును సంస్థలో జమ చేయడంలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్ నుంచి రావలసిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే నిరసన ఉధృతం చేస్తామన్నారు.

కనకమహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేకం

జగదాంబ కూడలి, జూలై 18: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేక సేవలను నిర్వహించారు. పూజల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేశారు. సర్వాంగ సుందరంగా అలకంరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు కాపు నేతల అభినందనలు


ఎమ్మెల్యే వంశీకృష్ణను అభినందిస్తున్న నాయకులు

సీతమ్మధార, జూలై 18: దక్షిణ ఎమ్మెల్యేగా గెలుపొందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సీతమ్మధార ప్రాంతానికి చెందిన కాపు నాయకులు మద్దింశెట్టి సురేష్‌కుమార్, కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న ఉషాకిరణ్

అక్కయ్యపాలెం, జూలై 18: ఎక్కువ మందితో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని నమోదు చేయించాలని పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ కార్యకర్తలకు సూచించారు. శాంతిపురంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. జనసైనికులు, వారి కుటుంబాల క్షేమం కోసం పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రమాదబీమాతో కూడిన సభ్యత్వాన్ని కల్పించడం ఆనందమన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో ఆంధ్రాకు మూడో స్థానం

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 18: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఏపీ ఓవరాల్ చాంపియన్‌షిప్ సెకెండ్ రన్నరప్‌గా (మూడో స్థానం) నిలిచిందని కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. బెంగళూరులో జరిగిన టోర్నీలో 36 పతకాలు సాధించారన్నారు. రేస్, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో ఈవెంట్లలో 41 మంది అథ్లెట్లు పాల్గొని 15 స్వర్ణ, పది రజత, 11 కాంస్య పతకాలు సాధించారన్నారు. కోచ్‌లు గిరీష్, మంజుల, అథ్లెట్లను గొనుగుంట్ల కోటేశ్వరరావు అభినందించారు.

'హయగ్రీవ'కు గనుల శాఖ షోకాజ్

... 5వ పేజీ తరువాయి

ప్రకారం అనుమతులు తీసుకున్న క్వారీల్లో తాత్కాలిక పర్మిట్లకు మించి తవ్వకాలు జరిపితే క్యూబిక్ మీటరుపై వసూలుచేసే సీనరేజ్‌కి ఐదు రెట్లు జరిమానా విధిస్తారు. ఒకవేళ ఎటువంటి అనుమతులు తీసుకోకపోతే పది రెట్లు జరిమానా విధిస్తారు. పర్మిట్లు తీసుకుంటే తవ్విన దానికి క్యూబిక్ మీటరుకు రూ.90 సీనరేజ్ చెల్లించాలి. అనుమతులు లేనందున హయగ్రీవ ఫార్మ్స్ తవ్విన 75,274 క్యూబిక్ మీటర్ల గ్రావెల్, రాయికి సుమారు రూ.ఏడు కోట్ల మేర జరిమానా విధించే అవకాశం ఉంది.

పోకిరీల పనిబడతాం

... 5వ పేజీ తరువాయి

పనిలో ఉంటారన్నారు. పోలీసులు అనేక రకాల విధులు నిర్వర్తించాల్సి ఉండడం, సిబ్బంది కొరత వంటి కారణాలతో రౌడీలు, సంఘవిద్రోహులు, దొంగలపైనా నిరంతరం పెట్టడానికి వీలుండదు కాబట్టి ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని ముందుగానే అందజేస్తే తగిన రక్షణ కల్పించడానికి అవకాశం ఉంటుందని సీపీ కోరారు.

క్లాక్ టవర్ ట్రయల్ రన్ సక్సెస్



జగదాంబ కూడలి, జూలై 18: క్లాక్ టవర్ నిర్మాణంతో జగదాంబ జంక్షన్ సరికొత్త అందాన్ని సంతరించుకుంది. మరికొద్ది రోజుల్లో దీనిని ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నలువైపులా అమర్చిన గడియారాలను పరిశీలించడంతో పాటు గంటల శబ్దం ఎలా వస్తున్నదీ ట్రయల్ రన్ నిర్వహించారు. రెండు రోజులుగా ఉదయం ఏడు గంటల సమయంలో మెకానిక్స్ ట్రయల్ వేస్తున్నారు. క్లాక్ టవర్ నుంచి వెలువడుతున్న ధ్వనులు చుట్టుపక్కల ప్రాంతాలకు వినిపిస్తున్నాయి. దీంతో వారంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు.

ఏయూలో ఏం జరుగుతోంది?

... 5వ పేజీ తరువాయి

లోనే ఉన్నారు. ఆయన భార్య లావణ్య ఏయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్. ఆమె ఎన్నికల ప్రచారం పాల్గొన్నారని ప్రసాదరెడ్డి సస్పెండ్ చేయించారు. వేధింపులు ఎదుర్కొన్న పల్లాకు కూడా ఇన్‌చార్జి వీసీని నియమిస్తున్న విషయం చెప్పలేదని సమాచారం.

యువ నాయకుడి సిఫారసు

జిల్లాలో టీడీపీ యువ నాయకుడిగా చెలామణీ అవుతున్న వ్యక్తి కూటమి అధికారంలోకి రాగానే పదవులు ఇప్పిస్తానంటూ ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఏయూ ఇన్‌చార్జి వీసీ నియామకం వెనుక ఆయన సిఫారసు ఉందని ప్రచారం జరుగుతోంది. ఆయన టీడీపీలో ఉంటూ వైసీపీకి చెందిన వారికి పదవులు ఇమ్మని ఎలా సిఫారసు చేశారు?, దానిని పెద్దలు ఎలా ఆమోదించారు? అనేది ఎవరికీ అర్థం కావడం లేదు.

ఏయూ ఇన్‌చార్జి వీసీగా శశిభూషణరావు

... 5వ పేజీ తరువాయి

ఆర్కిటెక్చర్ విభాగం ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు.

శశిభూషణరావు బాధ్యతల స్వీకారం

ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.శశిభూషణరావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్. ప్రస్తుతం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. బోధనలో 35 ఏళ్ల అనుభవం ఉంది. ఏయూలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్, ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లు తీసుకున్నారు. 275కి పైగా పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఐదు పాఠ్యపుస్తకాలు, వివిధ పుస్తకాల్లో 11 అధ్యాయాలు ఆయన రచించారు. ఆయన 2008లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకడమిషియన్ అవార్డును అందుకున్నారు. బెస్ట్ రీసెర్చర్ అవార్డు కూడా లభించింది. ఆయన పర్యవేక్షణలో తొమ్మిది రీసెర్చి ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఏయూ జర్నలిజం విభాగంలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం పరీక్షల విభాగం డీన్‌గా వ్యవహరిస్తున్నారు. జర్నలిజం విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, అంతర్జాతీయ భాషల అధ్యయన విభాగం డీన్‌గా, జపనీస్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఆయన డెక్కన్ క్రానికల్ దినపత్రిక ఎడిటోరియల్ విభాగంలో పనిచేశారు. వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ప్రస్తుతం ఏయూలో ఆ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

గ్రేటర్ సీఈ పోస్టుకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

విశాఖలోనే పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావు జీవీఎంసీ ఇన్‌చార్జి సీఈగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకోసం తనకు పరిచయమున్న కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న ప్రచారం జరుగుతోంది. అయితే వెంకటేశ్వరరావుకు మరో మూడు నెలలు మాత్రమే సర్వీసు ఉండడంతో ఆయన పట్ల ఎవరూ సానుకూలత వ్యక్తం చేయలేదని సమాచారం. మరోవైపు జీవీఎంసీలో సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న కె.వేణుగోపాల్, వినయ్‌కుమార్, కేవీఎన్ రవి కూడా సీఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్టు సమాచారం. ఇతర ప్రాంతాల నుంచి చీఫ్ ఇంజనీర్లను ఇక్కడ నియమించే అవకాశం ఇప్పట్లో లేనందున ఇన్‌చార్జి సీఈగా తమకు అవకాశం ఇవ్వాలంటూ ముగ్గురూ ఎవరికివారు తమకు అనుకూలంగా ఉండే రాజకీయ నేతలు, రాష్ట్రమున్సిపల్ శాఖలోని కీలక అధికారుల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే వీరిలో ఇద్దరు ఎస్ఈలు గత ప్రభుత్వంలో మునిసిపల్ శాఖలో కీలకంగా వ్యవహరించిన ఒక ఐఏఎస్ అధికారి చెప్పినట్టు నడుచుకున్నారని, వారి కనుసన్నల్లోనే రుషికొండపై రాజభవనం నిర్మాణపనులు జరిగాయని కూటమి నేతలకు కొందరు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో వారిద్దరినీ దూరంగా ఉంచాలని కూటమి నేతలంతా భావిస్తున్నట్టు జీవీఎంసీలో ప్రచారం జరుగుతోంది. సీఈ ఎంపికపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇళ్ల నిర్మాణంపై విచారణ?

... 5వ పేజీ తరువాయి

నోటిఫికేషన్ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. దీంతో ఆయా కాలనీల్లో సొత్తు దొంగలపాలైంది. కాపలాదారులే పలుచోట్ల ఇసుక, పిక్క అమ్ముకుంటున్నారు. ఆనందపురం మండలం తంగుడుబిల్లి, గిడిజాల కాలనీల్లో ఇసుక, పిక్క దొంగలపాలవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ లేఅవుట్లలో ఇనుము ఆరుబయట వదిలేశారు. స్థానికులు కొందరు దఫదఫాలుగా తరలించుకుపోతున్నారని చెబుతున్నారు. గిడిజాల, తంగుడుబిల్లి, పద్మనాభం మండలం నరసాపురంలో ఆరుబయటే సిమెంట్ బస్తాలు వదిలేయడంతో వర్షాలకు గడ్డకట్టాయి. సిమెంట్ బస్తాలపై వేసిన టార్పాలిన్లు గాలికి ఎగిరిపోవడంతో వర్షాలకు తడిసిపోయాయి. నాలుగు నెలల క్రితం పనులు నిలిచిపోయే సమయానికి 1,500 నుంచి రెండు వేల బస్తాల సిమెంట్, 100 టన్నులకుపైగా ఇనుము, వేల టన్నుల ఇసుక నిర్మాణ ప్రదేశాల్లో ఉండిపోయింది. రీచ్‌ల నుంచి తీసుకువచ్చిన ఇసుకలో వినియోగం ఎంత?, ఇంకా ఎంత మిగిలి ఉంది?...అనేదానిపై హౌసింగ్ అధికారులు లెక్కలు తీస్తున్నారు. గడ్డకట్టిన సిమెంట్ వల్ల నష్టం ఎంత?, అనేది అంచనా వేస్తున్నారు.

టమాటా కోసం బారులుతీరిన వినియోగదారులు

» రైతుబజారులో కిలో రూ.68

» బహిరంగ మార్కెట్‌లో రూ.100కు చేరిన ధర

» నేటి నుంచి రాయితీపై కిలో రూ.58కు విక్రయం


నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం క్యూలో జనం

అక్కయ్యపాలెం, జూలై 18: టమాటా ధర రోజురోజుకు పెరుగుతోంది. రైతబజార్లలో కిలో రూ.68కు చేరింది. బహిరంగ మార్కెట్‌లో రూ.100 దాటిపోవడంతో వినియోగదారులు రైతుబజార్లలోని విక్రయ స్టాళ్ల ఎదుట బారులుతీరుతున్నారు. నగరానికి అధికశాతం టమాటా మదనపల్లె నుంచి దిగుమతి అవుతుంది. గత కొద్దిరోజులుగా అక్కడి నుంచి సరకు తక్కువగా వస్తోంది. గురువారం నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం వినియోగదారులు ఉదయం నుంచీ బారులు తీరారు. ప్రస్తుతం పంట దిగుబడి లేకపోవడంతో రానున్న రోజుల్లో ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

నేటి నుంచి రాయితీపై విక్రయం

టమాటా ధర అమాంతం పెరగడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ మేరకు కిలో రూ.58 చొప్పున విక్రయించేందుకు రంగం సిద్ధం చేసింది. నరసింహనగర్ రైతుబజారులో శుక్రవారం ఉదయం నుంచి రాయితీ ధరపై టమాటాను విక్రయించనున్నామని, ఇప్పటికే 50 క్రేట్ల

సరకు వచ్చిందని ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు తెలిపారు.

సీతమ్మధార రైతుబజార్‌లో...

సీతమ్మధార: టమాటా ధరలు పెరగడంతో ప్రభుత్వం ఆదేశానుసారం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రాయితీపై అమ్మకాలు చేపడుతున్నారు. చిత్తూరు జిల్లా నుంచి సరకును తీసుకువచ్చి కిలో రూ.58కే విక్రయిస్తామని సీతమ్మధార రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు తెలిపారు.

పద్మనాభం కానిస్టేబుల్‌పై సీపీకి ఫిర్యాదు

» ఏఆర్‌కు అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పద్మనాభం పోలీస్‌స్టేషన్ జనరల్ కానిస్టేబుల్ దాలినాయుడును సీపీ శంఖబ్రతబాగ్చి ఏఆర్‌కు అటాచ్ చేశారు. దాలినాయుడు అవినీతికి పాల్పడుతున్నారని స్థానికులు సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. స్టేషన్‌లో సిబ్బంది కూడా ఆధారాలతో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సీపీ చర్యలు తీసుకున్నారు. దీనిపై సీపీ వద్ద ప్రస్తావించగా విచారణకు ఆదేశించామని, నివేదిక మేరకు కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


వివేక్ (ఫైల్)

మర్రిపాలెం, జూలై 18: ఢిల్లీ వెళ్లి మరుసటిరోజు వస్తానని విమానాశ్రయానికి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన దారపునేని వివేక్ (39) ఈనెల 13న కరాసలో తోడల్లుడు గోవిందరావు ఇంటికి వచ్చాడు. ఆదేరోజు మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లాలంటూ విమానాశ్రయానికి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చేస్తానని చెప్పి మూడు రోజులైనా రాకపోవడంతో విమానాశ్రయంలో విచారించగా ఢిల్లీ వెళ్లలేదని తెలిసింది. దీంతో పలు చోట్ల గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో వివేక్ భార్య అనూష ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐవి.చక్రధర్ రావు ఆధ్వర్యంలో హెచ్‌సీ వి.నానాజీ దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసినవారు 94403 59124, 9441705373 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.




తిరుగు రథయాత్రలో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టౌన్ కొత్త రోడ్డులోని ఆలయానికి చేరుకున్న రథాలు


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అగనంపూడిలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని 'పల్లా'కు వినతి

అగనంపూడి, జూలై 18: అగనంపూడి ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును తెలుగు మహిళ 79వ వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. పారిశ్రామికంగా దినాదినాభివృద్ధి చెందుతున్న ఈప్రాంతంలో అధిక శాతం రోజూ వారి కూలీలు, కార్మికులు, పేదలు అధికంగా ఉన్నారన్నారు. అలాగే స్థానిక ఏరియా ఆస్పత్రికి నిత్యం పలు ప్రాంతాల నుంచి రోగులు, సహాయకులు వస్తుంటారన్నారు. అగనంపూడి కూడలికి సమీపంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తే ఎంతో మందికి కడుపు నింప వచ్చునన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జగన్నాథస్వామి ఆలయ ట్రస్ట్ మాజీ చైర్మెన్ గొల్లవిల్లి వెంకటరావు తదితరులు ఉన్నారు.

86వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని..

గాజువాక: జీవీఎంసీ 86వ వార్డులో ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించవలసిందిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు పార్టీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో పల్లాను ఆయన కలిసి పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా వార్డులో గడిచిన ఐదేళ్లలో ఒక అభివృద్ధి పని జరగలేదన్నారు. డ్రైనేజీలు, రహదారులు, తాగునీటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు మాడిక కనకరాజు, వేగుంట శ్రీనివాస్, కర్రి గోవింద్, దేముడు, రాజు, నాగార్జున, అప్పారావు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జూలై 18: పద్మనాభపురం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బంటాకాలనీ, మేహాద్రి గెడ్డ కాలనీ, అప్పలనర్సయ్యకాలనీ, వెంకటసాయినగర్, రవినగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వైభవంగా పెద్దింటమ్మ పండగ

మల్కాపురం, జూలై 18: మల్కాపురంలో కొలువు దీరిన పెద్దింటమ్మ పండగను గురువా రం ఘనంగా నిర్వ హించారు. దశాబ్దాల తరబడి ఆషాఢ మాసం రెండో గురు వారం అమ్మవారి పండగను నిర్వహిం చడం ఆచారంగా వస్తోంది. ఈ సందర్భంగా నగరాల వీధిలో ఉన్న అమ్మవారి ఆలయానికి వేకుం జాము నుంచే అధిక భక్తులు విచ్చేసి పెద్దింటమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పెద్దింటమ్మను పురవీధుల్లో ఊరేగించారు ఈ సందర్భంగా అమ్మవారికి ఎంతో ఇష్టమైన ఆరిదిని ప్రజలంతా తమ ఇంట్లో తయారుచేసి ప్రసాదంలా స్వీకరించారు. అనంతరం వీధిలోకి అమ్మవారి ఘటాలను తలపై పెట్టుకుని వచ్చిన పూజారి కాలు కడిగి పూజలు చేశారు.

డీసీపీని కలిసిన టీడీపీ నాయకులు

పెదగంట్యాడ, జూలై 18: డీసీపీ-2గా బాధ్యతలు స్వీకరించిన తుహిన్ సిన్హాను తెలుగుదేశం పార్టీ పెదగంట్యాడ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సిన్హాను కలిసిన వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, మండల నాయకులు ములకలపల్లి పెంటయ్య నీలాపు అప్పలరెడ్డి, ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడీ, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 68, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 40, బీరకాయలు 28, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 34, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 140, మునక్కాడలు (కిలో) 90, బరబాటి 30, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 40, కీరదోస 24, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడుచిక్కుడు 95, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..


గోపాలపట్నం ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం


కూర్మన్నపాలెంలో కురుసున్న వాన

తెరిపివ్వని వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

రహదారుల్లోని గోతుల్లో వర్షపు నీరు తిష్ట వేయడంతో ఇబ్బందులకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు

సజావుగా సాగని ఫుట్‌పాత్ వ్యాపారాలు

గోపాలపట్నం, జూలై 18: ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి వర్షం కురుస్తునే ఉంది. తెరిపివ్వకుండా చిరుజల్లులు, మధ్య మధ్యలో మోస్తరు వర్షం కురుస్తుండడంతో రోడ్లన్నీ తడిసిముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వర్షం దెబ్బకు నిత్యం రద్దీగా ఉండే గోపాలపట్నం ప్రధాన రహదారి వెలవెలబోయింది. ప్రధాన రహదారిలోని వ్యాపార సముదాయాలతో పాటు ఫుట్‌పాత్ వ్యాపారాలు కూడా డీలా పడ్డాయి. గోపాలపట్నం కూడలి నిత్యం కొనుగోలుదారులతో వ్యాపార సముదాయాలు, రోడ్లు కిటకిటలాడుతాయి. అయితే ముసురు ప్రభావంతో జనాల తాకిడి లేకపోవడంతో షాపింగ్‌మాల్స్ ఖాళీగా కనిపించాయి. ప్రజలందరూ ఎక్కువగా పరిమితం కావడంతో పలు కూడళ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. వర్షం ప్రభావానికి ఎల్లపువానిపాలెం, వెంకటాపురం గ్రామాల్లోని అండర్ పాస్‌వేలు దుర్భరంగా మారాయి. వెంకటాపురం అండర్‌పాస్‌వేలో రోడ్డు నిర్మాణం జరగక పోవడంతో చిత్తడిగా మారింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఎల్లపువానిపాలెం అండర్ పాస్‌వే వద్ద వర్షపు నీరు చేరడంతో ఈ మార్గంలోనూ రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇక్కట్లకు గురవు తున్నారు. కాగా సాయంత్రం చాలామంది ఫుట్‌పాత్ వ్యాపారులు తమ దుకాణాలను తెరవలేదు.


శ్రీనగర్‌లోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు


ఆటోనగర్-యాదవ జగ్గరాజుపేట రోడ్డులో వర్షపు నీటితో నిండిన గోతులు

గాజువాక: వర్షానికి గాజువాకలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. భారీ వర్షం కాకుండా చిరుజల్లులు కురవడంతో వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీల ద్వారా దిగువ ప్రాంతానికి పోయింది. వర్షం కారణం ఫుట్‌పాత్ వ్యాపారాలు సజావుగా సాగలేదు.

కూర్మన్నపాలెం: ముసురు ప్రభావంతో వాతావరణం చల్లబడినా దైనందిన పనులు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఉద యం నుంచి రాత్రి వరకు చిరుజ ల్లులు కురుస్తునే ఉన్నాయి. మధ్య మధ్యలో జోరువాక కురవడంతో పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు, జలమయమయ్యాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి, వచ్చేటప్పుడు విద్యార్థులు, కార్యాలయాలు, పలు పరిశ్రమలకు విధులకు రాకపోకలు సాగించేటప్పుడు ఉద్యోగులు, కార్మికులు కాస్త ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డు పక్కన పలువురు చిరు వ్యాపారులు గొడుగులు వేసుకుని అమ్మకాలు సాగించారు.

ఆటోనగర్: జడివానకు ఆటోనగర్ నుంచి యాదవ జగ్గరాజుపేట, శ్రీనివాసనగర్, పకీరుతఖ్యా, చినగంట్యాడ రహదారుల్లోని గోతుల్లో నీరు నిలిచి పోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించిన వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వానొస్తే ఆయా గోతుల్లో వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపో తుండడం వల్ల తాము రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నామని పలువురు ద్విచక్ర వాహ నదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి త్వరితగతిన గోతుల పూడ్చివేతకు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

'పెందుర్తి'ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

94, 97 వార్డుల్లో సుడిగాలి పర్యటన

పెందుర్తి/వేపగుంట, జూలై 18: పెందుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి తనను అధిక మెజారిటీతో గెలిపించిన ప్రజల ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 94, 97 వార్డుల్లో గురువారం అయన సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా 97వ వార్డు శ్రమశక్తినగర్‌లో 1 నుంచి 6 లేఅవుట్ కాలనీ, చాణక్యనగర్, సప్తగిరినగర్‌లలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాలపై సమీక్ష చేశారు. పలు సమస్యలపై కాలనీవాసుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, విద్యుత్ శాఖ అధికారులతో ఆయన మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రధాన రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉండడాన్ని గుర్తించిన ఆయన వాటి ఆధునీకరణ పనులకు అంచనాలు రూపొందించాలని జెడ్సీని ఆదేశించారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

అలాగే 94వ వార్డు పరిధి ఆర్ఆర్‌వీ పురం, వెంకటసాయినగర్, వేపగుంట, ఎల్‌బీ నగర్ ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్ఆర్‌వీపురంలో దశాబ్దాల తరబడి హెచ్‌టీ వైర్ల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, వాటిని మార్చాలని కాలనీవాసులు కోరారు. ఆయా లైన్లను మార్చడానికి విద్యుత్ శాఖ ఇంజనీర్లు సమ్మతించినా అందుకయ్యే ఖర్చు సుమారు రూ.18 లక్షలను జీవీఎంసీ చెల్లించాల్సి ఉంది. వాటిని ఇప్పటివరకు చెల్లించకపోవటంపై అధికారులను పంచకర్ల ప్రశ్నించారు. అలాగే వెంకటసాయినగర్ కొండపై వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేపగుంట ఎంఎస్ రామయ్య షాపింగ్‌మాల్ సమీపంలోని నాగలక్ష్మి అపార్ట్‌మెంటు వాసులు మురుగు నీటి ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించగా, దీనిపై తగిన చర్యలు చేపట్టాలని పంచకర్ల అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు శేనాపతి వసంత శంకరరావు, బల్ల శ్రీనివాసరావు, జెడ్సీ కె.హైమావతి, ఈఈ రత్నాకర్, డీఈ విజయకుమార్, నాయకులు అవగడ్డ అప్పలనాయుడు శేనాపతి సోమశేఖర్ నాయుడు, ముమ్మన గురువు, మామిడి కిరణ్, వేణు, పిన్నింటి పార్వతి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు కరెన్సీ నోట్లు చింపేశారని..

క్షణికావేశంలో రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

గోపాలపట్నం, జూలై 18: పిల్లలు కరెన్సీ నోట్లను చింపేశారని క్షణికావేశంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన చందన్ కుమార్ (33) రైల్వేలో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య లాల్ ముస్నీకుమారి, ఇద్దరు చిన్నారులతో కొత్తపాలెం గణపతినగర్‌లో ఐదేళ్లగా నివసిస్తున్నారు. కాగా చందన్‌కుమార్‌కు కోపం ఎక్కువ కావడంతో చిన్న విషయాలకే కోపోద్రేకానికి గురయ్యే వారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి చందన్‌కుమార్ పిల్లలు ఆయన జేబులోని కొన్ని కరెన్సీ నోట్లను తీసి చింపేశారు. దీంతో ఆయన తీవ్రమైన కోపంతో తన గదిలోకి వెళ్లి క్షణికావేశంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంతసేపటికీ భర్త గది తలుపులు తీయకపోవడంతో అనుమానంతో ముస్నీకుమారి చుట్టుపక్కల వారి సాయంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా చందన్‌కుమార్ ఉరి వేసుకుని ఉండడంతో గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, ఆత్మహత్యకు గల కారణాలను ముస్నీకుమారిని అడిగి తెలుసుకున్నారు. చందన్‌కుమార్‌కు కోపం అధికమని, పిల్లలు అల్లరి చేసినా భరించేవాడు కాదని తెలిపింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ సురేశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చందన్‌కుమార్ మృతదేహం

అభివృద్ధి పనులు పరిశీలన

కూర్మన్నపాలెం, జూలై 18: జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు పరిశీలించారు. కాంట్రాక్టర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధే టీడీపీ ధ్యేయమని, వార్డులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ప్రజలకు మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొలగాని సన్యాసిరావు, ఉరుకూటి శ్రీనివాసరావు, ముమ్మిడివరపు రాము, ఒమ్మి రాము, తదితరులు పాల్గొన్నారు.


కళాకారున్ని సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న మౌర్యసింహ

ఘనంగా సింహాద్రి అవార్డుల ప్రదానోత్సవం

వేపగుంట, జూలై 18: ఇక్కడి నాయుడుతోట శ్రీలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం రాత్రి శ్రీసాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివంగత పెతకంశెట్టి అప్పలనరసింహం జ్ఞాపకార్థం సింహాద్రి అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ మాట్లాడుతూ తన తాత జ్ఞాపకార్థం నాటకాలు, డ్యాన్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభ కనబరిచిన కళాకారులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కళాకారులు బడే శ్రీరాములునాయుడు, మారెడ్ల వాసుదేవరావు, పడాల కృష్ణారావు, సింగిరెడ్డి గౌరీశ్వరిలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం, నృత్యభారతి డ్యాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖులు బొమ్మిడి రమణ, దాడి వెంకటరమేష్, అసోసియేషన్ ప్రతినిధులు పల్లి నల్లనయ్య, పి.సీతారామ్, ఎం.సుబ్రహ్మణ్యం, లక్ష్మీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లైజన్ అధికారిని కలిసిన ఓబీసీ సంఘం ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 18: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ నూతన లైజన్ అధికారిగా నియమితులైన ఎస్.ఉమామహేశ్వరరావును అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లైజన్ అధికారి మాట్లాడుతూ అసోసియేషన్‌ను మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి ఉద్యోగి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, ప్రతినిధులు యు.శ్రీనివాస్, కామేశ్వరరావు, సన్నిబాబు, నరసింగరావు, ఈశ్వరరావు, గౌరీ, ఉదయకుమారి, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో పులి కలకలం

అడవి పిల్లిగా నిర్ధారించిన అధికారులు


ఎల్ఐజీ పార్కులో పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

విశాఖపట్నం, జూలై 18: సాగర్‌నగర్ కాలనీలో గురువారం ఉదయం పులి కలకలం రేగింది. వేకువజామున 3 గంటలకు ఎల్ ఐజీ-ఎ-గృహ సముదాయంలో నివాసం వుంటున్న ప్రసాద్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి ప్రధాన ద్వారం తలుపు తీసుకుని బయటకు వచ్చాడు. ఎదురుగా రోడ్డుపై పులి కనిపించిందని, భయపడి తిరిగి ఇంట్లోకి వెళ్లి తలుపు మాటు నుంచి చూసే సరికి రోడ్డు పక్కనున్న చెట్టు ఎక్కే ప్రయత్నం చేసిందని, చెట్టు ఎక్కలేక అక్కడి నుంచి సాగర్‌నగర్ వాటర్ ట్యాంకు వైపు వెళ్లినట్టు ఆయన తెలిపారు. వాటర్ ట్యాంకు దగ్గర రహదారిపై మార్నింగ్ వాక్ చేస్తున్న మహిళ కూడా తనకు పులి కనిపించిందని, భయంతో ఇంటికి పరుగు తీసినట్టు చెప్పింది. వారిద్దరూ ఆయా ప్రాంతాల్లోని స్థానికులకు చెప్పిన ఈ మాటలు సాగర్‌నగర్ కాలనీ మొత్తం దావాళంలా వ్యాపించడంతో అందరిలోనూ భయాందోళన నెలకొంది. దీంతో సాగర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.శ్రీరామవర్మ, టీడీపీ నాయకుడు బి. దొరబాబు, రాజా, తదితరులు పులి సంచరించినట్టు చెబుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎల్ఐజీ ఎ గృహ సముదాయంలో ఉన్న పార్కులో పులిని పోలిన పాదముద్రలు ఉన్నట్టు గుర్తించి, అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ ఎల్లారావు, సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్సు అధికారులు పార్కుకు చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. అవి పులివి కాదని, అడవి పిల్లి జాతికి చెందిన జంతువువని చెప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నో పార్కింగ్ ప్రాంతాల్లో ఉన్న వాహనాలను స్టేషన్‌కు తరలించిన ట్రాఫిక్ పోలీసులు

సింధియా, జూలై 18: నో పార్కింగ్ ఏరియాలో ఉంచిన వాహనాలపై మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలను టోయింగ్ వాహనంతో స్టేషన్‌కు తరలించారు. మల్కాపురం, శ్రీహరిపురం మెయిన్ రోడ్డుపై అనధికారికంగా పార్కింగ్ చేసిన పలు వాహనాలను గురువారం స్టేషన్‌కు తీసుకుపోయారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

జనసేన సభ్యత్వాన్ని గౌరవంగా భావించాలి

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూలై 18: జనసేన సభ్యత్వాన్ని కార్యకర్తలందరూ గౌరవంగా భావించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 97వ వార్డు పరిధి చినముషిడివాడలో గురువారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్ల చేతుల మీదుగా 50 మంది కార్యకర్తలు సభ్యత్వం స్వీకరించారు. ఈ నెల 28వ వరకు జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతా మహాయజ్ఞంలా నిర్వహించాలన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో మొదటి విడతగా 50 వేల సభ్యత్వ నమోదు జరగాలన్నది తమ లక్ష్యమని పంచకర్ల పేర్కొన్నారు. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసైనికులు పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు శేనాపతి సోమశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు శేనాపతి బుజ్జి, లీలాధర్, అధిక సంఖ్యలో వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన గెడ్డల్లో పూడికల తొలగింపు


65వ వార్డులోని గెడ్డలో పూడికలను తొలగిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ, జూలై 19: మండల పరిధిలోని పలు గెడ్డలో పేరుకుపోయిన పూడికలను ఎక్స్‌కవేటర్లతో యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ సిబ్బంది గెడ్డల్లోని పూడికలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. భారీ వర్షాలు కురిసినా నీరు సజావుగా దిగువ ప్రాంతానికి పారేలా చర్యలు చేపడుతున్నారు. ఒక్కో గెడ్డలో పూడికలు తీసేందుకు రెండు ఎక్స్‌కవేటర్లతో పాటు తీసిన చెత్తా చెదారం, వ్యర్థాలను తరలించేందుకు భారీ వాహనాలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 65వ వార్డు పరిధిలోని ప్రధాన గెడ్డలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే రామచంద్రానగర్ దగ్గరున్న చాకలి గెడ్డ, పోర్టు రోడ్డు పక్కనున్న ప్రధాన కాలువ, పెదగంట్యాడ నుంచి పోర్టు జంక్షన్‌కు ఉన్న కాలువల్లో పూడికలు తొలగింపు పనులు జరుగుతున్నాయి. గెడ్డల్లోని పూడికలను పూర్తి స్థాయిలో తొలగించేంత వరకు ఈ పనులు కొనసాగుతాయని ప్రజారోగ్య విభాగం అధికారులు తెలిపారు.

చురుగ్గా మాజీ సైనికోద్యోగి హత్య కేసు దర్యాప్తు

గాజువాక, జూలై 18: గాజువాకలో సంచలనం రేపిన మాజీ సైనికోద్యోగి హత్య కేసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. గాజువాక జగ్గు జంక్షన్ వద్ద మాజీ సైనికోద్యోగి వేమిరెడ్డి అప్పలనాయుడు హత్యకు గురైన సంగతి తెలిసిందే. హత్యకు పాల్పడిన బంకా రాము, బంకా అశోక్‌లను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే మృతుని భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదులో జనసేన నాయకుడు కరణం కనకారావు కూడా తన భర్తను బెదిరించాడని పేర్కొనడంతో పోలీసులు ఆ దిశగా విచారణ జరుపుతున్నారు. ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నామని గాజువాక పోలీసులు తెలిపారు.

కాలువలో పసికందు మృతదేహం లభ్యం

మల్కాపురం, జూలై 18: అప్పుడే పుట్టిన పసికందు మృతదేహం శ్రీహరిపురం కారాడ వీధిలోని కాలువలో గురువారం ఉదయం లభ్యమైంది. ఈ పసికందును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కాలులో పడేశారు. పసికందు (బాలుడి) మృతదేహాన్ని చూసిన వారంతా ఏ తల్లి ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టిందోనని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు మల్కాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ మృతదేహాన్ని ఎవరు కాలువలో పడేశారో తెలుసుకునేందుకు పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

21న గురు పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

అగనంపూడి, జూలై 18: ఇక్కడి షిర్డీ సాయి ఆలయంలో ఈ నెల 21న గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు షిర్డీ సాయి సేవా సమితి ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం వారు ఆలయంలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. సమితి అధ్యక్షుడు కొయ్య వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఏటా మాదిరిగానే గురు పౌర్ణమి వేడుకలను భారీగా నిర్వహిస్తామన్నారు. భక్తుల దర్శనాలకు, ప్రసాద వితరణకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు డి.వ్యాసశర్మ, పి.రామారావు, జి.శంభుడు, పీఎల్ఎన్ రాజు, సత్యనారాయణ, సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, లీలావతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాధవధార, జూలై 18: నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్ 2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. మాధవధార బస్టాప్, సీతన్న గార్డెన్స్, ఎంఎస్ఆర్ పార్క్, విద్యానగర్ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు.

సీతమ్మధార పరిధిలో...

సీతమ్మధార: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్ 1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్, ఏపీఎస్ఈబీ కాలనీ, డాక్టర్ గణేష్ బాబు ఆస్పత్రి, ఏఎస్ఆర్ నగర్, సీతమ్మధార ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన

అల్లిపురం, జూలై 18: విశాఖ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అనీల్‌నీరుకొండ దంత వైద్యశాల సహకారంతో ఆశీల్‌మెట్ట వద్ద నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనంతరం విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.టి.రోహిత, డా.ఎస్.రోషిణి, డా.రీనా, డా.కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జె.గౌరీశంకర్, వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రకాష్, సుభాషిణి పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా కుంభకోణాలమయం

» **టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ**

మహారాణిపేట, జూలై 18: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలన అంతా కుంభకోణాలమయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కొట్టేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు దోచుకున్నారన్నారు. దీని విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.35,500 కోట్లు ఉంటుందని వివరించారు. విశాఖలో అధికశాతం ప్రభుత్వ భూములు వైసీపీ నాయకులు దోపిడీ చేశారని, ఇళ్ల పట్టాల పేరుపైరూ.10 వేల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. అధికారులను బెదిరించి, ప్రభుత్వ భూములను బదిలీ చేయించుకున్నారని, సామంతరాజుల్లా వ్యవహరించి విశాఖను దోచుకున్నారన్నారు. ప్రభుత్వ భూములు, రామానాయుడు స్టూడియో భూములు, దసపల్లా భూములు, సీబీసీ ఎంసీ, హయగ్రీవ భూములను అడ్డదారిలో లాగేసుకున్నారన్నారు. భూ అవకతవకలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతో పాటు అన్యాక్రాంతమైన భూములన్నింటినీ తిరిగి తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి భోగాపురం వరకు గత ప్రభుత్వం ప్రతిపాదించిన మాస్టర్‌ప్లాన్ రహదారిలో జరిగిన అక్రమాలను మ్యాప్‌లో చూపించారు. దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ దేవదాయ శాఖ అధికారి శాంతిని విశాఖ భరించలేకపోయిందని, ఆమె ఇక్కడ పనిచేస్తు న్న సమయంలో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయారన్నారు. స్థానిక నేతలు విజయసాయిరెడ్డికి చెప్పినా వినకుండా ఆమెకు వత్తాసు పలికారని, చివరికి సీఎంవో కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతోనే ఆమెకు విజయవాడ బదిలీ జరిగిందని వివరించారు. విజయసాయిరెడ్డి తన కుమార్తె పేరుపై విశాఖలో అనేక భూములు బలవంతంగా కొనుగోలు చేశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు పొలమరశెట్టి శ్రీనివాసరావు, ఎర్నాకుల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

అందరూ చూడాల్సిన సినిమా బ్రహ్మా సో విష్ణు

డాబాగార్డెన్స్, జూలై 18: భగవంతుని ప్రేరణతో సామాన్యుడు మాధవుడిగా ఎలా పరివర్తన చెందాడనే కథాంశంతో బ్రహ్మా సో విష్ణు హిందీ సినిమా తెరకెక్కిందని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రమ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియాతో మాట్లాడారు. విశాఖలోని బ్రహ్మకుమారీ సేవా కేంద్రం ఆధ్వర్యంలో బ్రహ్మాసో విష్ణు హిందీ సినిమాను ఈ నెల 20,21 తేదీల్లో ప్రదర్శిస్తామన్నారు. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా దర్శకుడు ముప్పాలనేని శివ దర్శకత్వంలో సినిమా రూపొందించామన్నారు. గాజువాక లక్ష్మీకాంత్, మధురవాడ కృష్ణా మినీప్లెక్స్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రదర్శన ఉంటుందన్నారు. నటుడు ప్రసన్నకుమార్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్రహ్మాసో విష్ణు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉత్తమ విద్యార్థులకు 28న బహుమతుల ప్రదానం

అక్కయ్యపాలెం, జూలై 18: పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకుంటున్న గవర విద్యార్థుల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి ఈనెల 28న బహుమతులు ప్రదానం చేస్తామని కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో గురువారం విలేకరుల మావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు కళావాణి విశ్వనాథ కన్వెన్షన్ ఆడిటోరియంలో ఈ నెల 28న బహుమతుల ప్రదానోత్సవ అభినందన సభ నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది 550 మంది దరఖాస్తు చేసుకున్నారని, 80 శాతానికిపైగా మార్కులు సాధించిన వారికి షీల్డ్, నగదు బహుమతి అందిస్తామన్నారు. సమావేశంలో మొల్లేటి కుమారస్వామి, వేగి సత్యనారాయణ, మళ్ళ బలరాం, పెంటకోట సంజీవరావు, శరగడం సత్యనారాయణ, పారుపల్లి రవి, మళ్ళ రవికుమార్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని క్లాప్ డ్రైవర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న క్లాప్ వాహనాల డ్రైవర్లు

మర్రిపాలెం, జూలై 18: జోన్ -5 కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లకు, లోడర్స్‌కు జీతాల బకాయిలు తక్షణమే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అధ్వర్యంలో గురువారం విధులు బహిష్కరించి మర్రిపాలెం నరేంద్రనగర్ సమీపంలో నిరసన తెలిపారు. ఈనెల పదో తేదీన చెల్లించాల్సిన జీతాలు ఇప్పటివరకు అందలేదన్నారు. ఆరు నెలలుగా ఇదే జీతాలు చెల్లించడంలేదని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ సొమ్మును సంస్థలో జమ చేయడంలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్ నుంచి రావలసిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే నిరసన ఉధృతం చేస్తామన్నారు.

కనకమహాలక్ష్మికి త్రికాల పంచామృతాభిషేకం

జగదాంబ కూడలి, జూలై 18: వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం త్రికాల పంచామృతాభిషేక సేవలను నిర్వహించారు. పూజల్లో ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం చేశారు. సర్వాంగ సుందరంగా అలకంరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు కాపు నేతల అభినందనలు

సీతమ్మదార, జూలై 18: దక్షిణ ఎమ్మెల్యేగా గెలుపొందిన వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సీతమ్మధార ప్రాంతానికి చెందిన కాపు నాయకులు మద్దింశెట్టి సురేష్‌కుమార్, కార్యదర్శి ఎర్రంశెట్టి సురేష్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.


ఎమ్మెల్యే వంశీకృష్ణను అభినందిస్తున్న నాయకులు

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం

అక్కయ్యపాలెం, జూలై 18: ఎక్కువ మందితో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని నమోదు చేయించాలని పార్టీ ఉత్తర ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ కార్యకర్తలకు సూచించారు. శాంతిపురంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. జనసైనికులు, వారి కుటుంబాల క్షేమం కోసం పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రమాదబీమాతో కూడిన సభ్యత్వాన్ని కల్పించడం ఆనందమన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.


సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్న ఉషాకిరణ్

పారా అథ్లెటిక్స్‌లో ఆంధ్రాకు మూడో స్థానం

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 18: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఏపీ ఓవరాల్ చాంపియన్‌షిప్ సెకెండ్ రన్నరప్‌గా (మూడో స్థానం) నిలిచిందని కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. బెంగళూరులో జరిగిన టోర్నీలో 36 పతకాలు సాధించారన్నారు. రేస్, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో ఈవెంట్లలో 41 మంది అథ్లెట్లు పాల్గొని 15 స్వర్ణ, పది రజత, 11 కాంస్య పతకాలు సాధించారన్నారు. కోచ్‌లు గిరీష్, మంజుల, అథ్లెట్లను గొనుగుంట్ల కోటేశ్వరరావు అభినందించారు.

'హయగ్రీవ'కు గనుల శాఖ షోకాజ్

... 5వ పేజీ తరువాయి

ప్రకారం అనుమతులు తీసుకున్న క్వారీల్లో తాత్కాలిక పర్మిట్లకు మించి తవ్వకాలు జరిపితే క్యూబిక్ మీటరుపై వసూలుచేసే సీనరేజ్‌కి ఐదు రెట్లు జరిమానా విధిస్తారు. ఒకవేళ ఎటువంటి అనుమతులు తీసుకోకపోతే పది రెట్లు జరిమానా విధిస్తారు. పర్మిట్లు తీసుకుంటే తవ్విన దానికి క్యూబిక్ మీటరుకు రూ.90 సీనరేజ్ చెల్లించాలి. అనుమతులు లేనందున హయగ్రీవ ఫార్మ్స్ తవ్విన 75,274 క్యూబిక్ మీటర్ల గ్రావెల్, రాయికి సుమారు రూ.ఏడు కోట్ల మేర జరిమానా విధించే అవకాశం ఉంది.

పోకిరీల పనిబడతాం

... 5వ పేజీ తరువాయి

పనిలో ఉంటారన్నారు. పోలీసులు అనేక రకాల విధులు నిర్వర్తించాల్సి ఉండడం, సిబ్బంది కొరత వంటి కారణాలతో రౌడీలు, సంఘవిద్రోహులు, దొంగలపైనా నిరంతరం పెట్టడానికి వీలుండదు కాబట్టి ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని ముందుగానే అందజేస్తే తగిన రక్షణ కల్పించడానికి అవకాశం ఉంటుందని సీపీ కోరారు.

క్లాక్ టవర్ ట్రయల్ రన్ సక్సెస్

జగదాంబ కూడలి, జూలై 18: క్లాక్ టవర్ నిర్మాణంతో జగదాంబ జంక్షన్ సరికొత్త అందాన్ని సంతరించుకుంది. మరికొద్ది రోజుల్లో దీనిని ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నలువైపులా అమర్చిన గడియారాలను పరిశీలించడంతో పాటు గంటల శబ్దం ఎలా వస్తున్నదీ ట్రయల్ రన్ నిర్వహించారు. రెండు రోజులుగా ఉదయం ఏడు గంటల సమయంలో మెకానిక్స్ ట్రయల్ వేస్తున్నారు. క్లాక్ టవర్ నుంచి వెలువడుతున్న ధ్వనులు చుట్టుపక్కల ప్రాంతాలకు వినిపిస్తున్నాయి. దీంతో వారంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు.



ఏయూలో ఏం జరుగుతోంది?

... 5వ పేజీ తరువాయి

లోనే ఉన్నారు. ఆయన భార్య లావణ్య ఏయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్. ఆమె ఎన్నికల ప్రచారం పాల్గొన్నారని ప్రసాదరెడ్డి సస్పెండ్ చేయించారు. వేధింపులు ఎదుర్కొన్న పల్లాకు కూడా ఇన్‌చార్జి వీసీని నియమిస్తున్న విషయం చెప్పలేదని సమాచారం.

యువ నాయకుడి సిఫారసు

జిల్లాలో టీడీపీ యువ నాయకుడిగా చెలామణి అవుతున్న వ్యక్తి కూటమి అధికారంలోకి రాగానే పదవులు ఇప్పిస్తానంటూ ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఏయూ ఇన్‌చార్జి వీసీ నియామకం వెనుక ఆయన సిఫారసు ఉందని ప్రచారం జరుగుతోంది. ఆయన టీడీపీలో ఉంటూ వైసీపీకి చెందిన వారికి పదవులు ఇమ్మని ఎలా సిఫారసు చేశారు?, దానిని పెద్దలు ఎలా ఆమోదించారు? అనేది ఎవరికీ అర్థం కావడం లేదు.

ఏయూ ఇన్‌చార్జి వీసీగా శశిభూషణరావు

... 5వ పేజీ తరువాయి

ఆర్కిటెక్చర్ విభాగం ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు.

శశిభూషణరావు బాధ్యతల స్వీకారం

ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.శశిభూషణరావు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్. ప్రస్తుతం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. బోధనలో 35 ఏళ్ల అనుభవం ఉంది. ఏయూలో బీటెక్, జేఎన్‌టీయూలో ఎంటెక్, ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ఆయన పర్యవేక్షణలో 51 మంది డాక్టరేట్లు తీసుకున్నారు. 275కి పైగా పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఐదు పాఠ్యపుస్తకాలు, వివిధ పుస్తకాల్లో 11 అధ్యాయాలు ఆయన రచించారు. ఆయన 2008లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ అకడమిషియన్ అవార్డును అందుకున్నారు. బెస్ట్ రీసెర్చర్ అవార్డు కూడా లభించింది. ఆయన పర్యవేక్షణలో తొమ్మిది రీసెర్చి ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి ఏయూ జర్నలిజం విభాగంలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం పరీక్షల విభాగం డీన్‌గా వ్యవహరిస్తున్నారు. జర్నలిజం విభాగం అధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, అంతర్జాతీయ భాషల అధ్యయన విభాగం డీన్‌గా, జపనీస్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఆయన డెక్కన్ క్రానికల్ దినపత్రిక ఎడిటోరియల్ విభాగంలో పనిచేశారు. వైఎస్ఆర్ జిల్లాలోని ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ ప్రస్తుతం ఏయూలో ఆ విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

గ్రేటర్ సీఈ పోస్టుకు పైరవీలు

... 5వ పేజీ తరువాయి

విశాఖలోనే పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావు జీవీఎంసీ ఇన్‌చార్జి సీఈగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకోసం తనకు పరిచయమున్న కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్న ప్రచారం జరుగుతోంది. అయితే వెంకటేశ్వరరావుకు మరో మూడు నెలలు మాత్రమే సర్వీసు ఉండడంతో ఆయన పట్ల ఎవరూ సానుకూలత వ్యక్తం చేయలేదని సమాచారం. మరోవైపు జీవీఎంసీలో సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న కె.వేణుగోపాల్, వినయ్‌కుమార్, కేవీఎన్ రవి కూడా సీఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్టు సమాచారం. ఇతర ప్రాంతాల నుంచి చీఫ్ ఇంజనీర్లను ఇక్కడ నియమించే అవకాశం ఇప్పట్లో లేనందున ఇన్‌చార్జి సీఈగా తమకు అవకాశం ఇవ్వాలంటూ ముగ్గురూ ఎవరికివారు తమకు అనుకూలంగా ఉండే రాజకీయ నేతలు, రాష్ట్రమున్సిపల్ శాఖలోని కీలక అధికారుల ద్వారా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే వీరిలో ఇద్దరు ఎస్ఈలు గత ప్రభుత్వంలో మునిసిపల్ శాఖలో కీలకంగా వ్యవహరించిన ఒక ఐఏఎస్ అధికారి చెప్పినట్టు నడుచుకున్నారని, వారి కనుసన్నల్లోనే రుషికొండపై రాజభవనం నిర్మాణపనులు జరిగాయని కూటమి నేతలకు కొందరు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో వారిద్దరినీ దూరంగా ఉంచాలని కూటమి నేతలంతా భావిస్తున్నట్టు జీవీఎంసీలో ప్రచారం జరుగుతోంది. సీఈ ఎంపికపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇళ్ల నిర్మాణంపై విచారణ?

... 5వ పేజీ తరువాయి

నోటిఫికేషన్ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం ఇళ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. దీంతో ఆయా కాలనీల్లో సొత్తు దొంగలపాలైంది. కాపలాదారులే పలుచోట్ల ఇసుక, పిక్క అమ్ముకుంటున్నారు. ఆనందపురం మండలం తంగుడుబిల్లి, గిడిజాల కాలనీల్లో ఇసుక, పిక్క దొంగలపాలవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ లేఅవుట్లలో ఇనుము ఆరుబయట వదిలేశారు. స్థానికులు కొందరు దఫదఫాలుగా తరలించుకుపోతున్నారని చెబుతున్నారు. గిడిజాల, తంగుడుబిల్లి, పద్మనాభం మండలం నరసాపురంలో ఆరుబయటే సిమెంట్ బస్తాలు వదిలేయడంతో వర్షాలకు గడ్డకట్టాయి. సిమెంట్ బస్తాలపై వేసిన టార్పాలిన్లు గాలికి ఎగిరిపోవడంతో వర్షాలకు తడిసిపోయాయి. నాలుగు నెలల క్రితం పనులు నిలిచిపోయే సమయానికి 1,500 నుంచి రెండు వేల బస్తాల సిమెంట్, 100 టన్నులకుపైగా ఇనుము, వేల టన్నుల ఇసుక నిర్మాణ ప్రదేశాల్లో ఉండిపోయింది. రీచ్‌ల నుంచి తీసుకువచ్చిన ఇసుకలో వినియోగం ఎంత?, ఇంకా ఎంత మిగిలి ఉంది?...అనేదానిపై హౌసింగ్ అధికారులు లెక్కలు తీస్తున్నారు. గడ్డకట్టిన సిమెంట్ వల్ల నష్టం ఎంత?, అనేది అంచనా వేస్తున్నారు.

టమాటా కోసం బారులుతీరిన వినియోగదారులు

» రైతుబజారులో కిలో రూ.68

» బహిరంగ మార్కెట్‌లో రూ.100కు చేరిన ధర

» నేటి నుంచి రాయితీపై కిలో రూ.58కు విక్రయం

అక్కయ్యపాలెం, జూలై 18: టమాటా ధర రోజురోజుకు పెరుగుతోంది. రైతబజార్లలో కిలో రూ.68కు చేరింది. బహిరంగ మార్కెట్‌లో రూ.100 దాటిపోవడంతో వినియోగదారులు రైతుబజార్లలోని విక్రయ స్టాళ్ల ఎదుట బారులుతీరుతున్నారు. నగరానికి అధికశాతం టమాటా మదనపల్లె నుంచి దిగుమతి అవుతుంది. గత కొద్దిరోజులుగా అక్కడి నుంచి సరకు తక్కువగా వస్తోంది. గురువారం నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం వినియోగదారులు ఉదయం నుంచీ బారులు తీరారు. ప్రస్తుతం పంట దిగుబడి లేకపోవడంతో రానున్న రోజుల్లో ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

నేటి నుంచి రాయితీపై విక్రయం

టమాటా ధర అమాంతం పెరగడంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఈ మేరకు కిలో రూ.58 చొప్పున విక్రయించేందుకు రంగం సిద్ధం చేసింది. నరసింహనగర్ రైతుబజారులో శుక్రవారం ఉదయం నుంచి రాయితీ ధరపై టమాటాను విక్రయించనున్నామని, ఇప్పటికే 50 క్రేట్ల సరకు వచ్చిందని ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు తెలిపారు.


నరసింహనగర్ రైతుబజారులో టమాటా కోసం క్యూలో జనం

సీతమ్మధార రైతుబజార్‌లో...

సీతమ్మధార: టమాటా ధరలు పెరగడంతో ప్రభుత్వం ఆదేశానుసారం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రాయితీపై అమ్మకాలు చేపడుతున్నారు. చిత్తూరు జిల్లా నుంచి సరకును తీసుకువచ్చి కిలో రూ.58కే విక్రయిస్తామని సీతమ్మధార రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు తెలిపారు.

పద్మనాభం కానిస్టేబుల్‌పై సీపీకి ఫిర్యాదు

» **ఏఆర్‌కు అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు**

విశాఖపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పద్మనాభం పోలీస్‌స్టేషన్ జనరల్ కానిస్టేబుల్ దాలినాయుడును సీపీ శంఖబ్రతబాగ్చి ఏఆర్‌కు అటాచ్ చేశారు. దాలినాయుడు అవినీతికి పాల్పడుతున్నారని స్థానికులు సీపీ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. స్టేషన్‌లో సిబ్బంది కూడా ఆధారాలతో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో సీపీ చర్యలు తీసుకున్నారు. దీనిపై సీపీ వద్ద ప్రస్తావించగా విచారణకు ఆదేశించామని, నివేదిక మేరకు కఠిన చర్యలు ఉంటాయన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మర్రిపాలెం, జూలై 18: ఢిల్లీ వెళ్లి మరుసటిరోజు వస్తానని విమానాశ్రయానికి వెళ్లిన వ్యక్తి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన దారపునేని వివేక్ (39) ఈనెల 13న కరాసలో తోడల్లుడు గోవిందరావు ఇంటికి వచ్చాడు. ఆదేరోజు మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లాలంటూ విమానాశ్రయా నికి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చేస్తానని చెప్పి మూడు రోజులైనా రాకపోవడంతో విమానాశ్రయంలో విచారించగా ఢిల్లీ వెళ్లలేదని తెలిసింది. దీంతో పలు చోట్ల గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో వివేక్ భార్య అనూష ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐవి.చక్రధర్ రావు ఆధ్వర్యంలో హెచ్‌సీ వి.నానాజీ దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసినవారు 94403 59124, 9441705373 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.


వివేక్ (ఫైల్)





తిరుగు రథయాత్రలో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టౌన్ కొత్త రోడ్డులోని ఆలయానికి చేరుకున్న రథం

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జూలై 18 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసిన బేడామండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామార్చన పఠిస్తూ ప్రతి నామానికి ఒక స్వర్ణ పుష్పంతో స్వామివారిని అర్చించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

21న తుది విడత చందనం సమర్పణ

సింహాచలం, జూలై 18 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పైపూతగా ఉండే చందనాన్ని తుది విడత (నాల్గవ) ఈనెల 21న సమర్పించనున్నారు. ఈమేరకు అవసరమైన మూడు మణుగుల (125 కిలోల) చందనపు ముద్దను ఆలయ నాల్గవ తరగతి సిబ్బంది నాలుగు రోజుల పాటు అరగదీశారు. గురువారం 30 కిలోల చందనాన్ని అరగదీశారు. సిబ్బంది అరగదీసిన చందనపు ముద్దను ఆలయ ఏఈఓ ఆనంద కుమార్, స్థానాచార్యులు రాజగోపాల్ తునిక వేసి పద్మనిధిలో భద్రపరిచారు. అందులో 32 రకాల సుగంధ ద్రవ్యాలను మిళితం చేసి ఈనెల 21న తెల్లవారుజామున సుప్రభాత సేవ తరువాత స్వామివారికి సమర్పించనున్నారు.

23న భూలోకమాత పండగ

వెంకోజీపాలెం, జూలై 18 : కొత్తవెంకోజీపాలెం గ్రామస్థుల ఇలవేల్పు భూలోకమాత అమ్మవారి పండగ ఈనెల 23న జరగనుంది. ఈమేరకు ఆలయాన్ని రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే గ్రామాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఆలయం ఉండడంతో హైవే మధ్యలో ఉన్న డివైడర్‌కు కూడా విద్యుత్ లైటింగ్ అమరుస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు మాట్లాడుతూ 21 నుంచి ఉత్సవం ప్రారంభమవుతుందని, 22న తొలేళ్లు, 23న అనుపోత్సవం ఉంటుందని చెప్పారు. అనుపోత్సవం రోజున ఉదయం 5 నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన జరుగుతుందన్నారు. సాయంత్రం పరస, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 30న మారువారం ఉత్సవం, అదే రోజు అన్నదానం, సాయంత్రం 108 కలశాలతో అమ్మవారి ఊరేగింపు ఉంటుందని చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జూలై 18 : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శివశక్తినగర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శివశక్తినగర్, సద్గురు సాయినాథ్ కాలనీ, గణేష్‌నగర్, శ్రీలక్ష్మీనగర్, అయ్యప్పనగర్, దివ్యాంగుల కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, టైలర్స్ కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

భీమిలిలో...

భీమునిపట్నం : మండలంలోని 11 కేవీ పాతపరదేశిపాలెం, పాలిటెక్నిక్ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు.పాతపరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం, స్మిత్ స్ట్రీట్, జగనన్న కాలనీ, నేరేళ్లవలస కాలనీ, భీమిలి టౌన్ ఏరియా ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

యువకుడి నిజాయితీ

ఆరిలోవ, జూలై 18 : ఆరిలోవ పోలీసు స్టేషన్‌కి సమీపంలో ఉన్న ఏటీఎంలో నగదు డ్రా చేయడానికి వెళ్లిన యువకుడు ఈశ్వరరావుకు అక్కడ రూ. 5 వేల దొరికాయి. దీంతో ఆయన ఆ నగదును సీఐ గోవిందరావుకు అందించి, నగదు పోగొట్టుకున్న వారికి అందజేయాలని కోరాడు. సీఐ యువకుడి నిజాయితీని మెచ్చుకుని సత్కరించారు.

హెల్మెట్ ధరించకపోతే చర్యలు

సింహాచలం, జూలై 18 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం ఆయన సింహాచలం ప్రధాన కూడలిలో హెల్మెట్ ధారణపై యువతకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

సినిమా గైడ్

● **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)

● **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),

● **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),

● **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 68, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 40, బీరకాయలు 28, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 42, క్యాబేజ్ 34, క్యారేట్ 30, దొండకాయలు 30, బంగాళా దుంపలు 32, అరటి కాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 140, బరబటి 30, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోస కాయలు 16,వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 84, పొటల్స్ 40, కీరదోస 24, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 36, కంద 62, దేముడు చిక్కుడు 95, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



మద్ది : పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారి శ్రీనివాసరావు



తగరపువలసలో ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

పద్మనాభం, జూలై 18 : వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎంవీఏ శ్రీనివాసరావు చెప్పారు. గురువారం ఆయన పద్మనాభం, మద్ది, పాండ్రంగి గ్రామాల్లో మంచినీటి ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్, కాలువల్లో పూడికతీత పనులను పర్యవేక్షించి సర్పంచులకు, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ట్యాంకు శుభ్రపరిచిన తేదీలను ఆయా పథకాల వద్ద బోర్డుపై రాయాలన్నారు.ట్యాంకును నింపిన ప్రతిసారి మంచినీటిని కూడా క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. అలాగే దోమలు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా పూడిక తొలగించాలన్నారు.మురుగునీరు నిల్వ ఉన్న చోట దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ విస్తరణాధికారి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ తగరపువలస కూడలిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి నుంచి మార్కెట్, మీసేవ, సంతపేట మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో అతిసార, డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జి. అప్పలనాయుడు, రెండో వార్డు అధ్యక్షుడు బి. నీలకంఠం, కార్యదర్శి పిట్టా వెంకటరావు ఉపాధ్యక్షుడు గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురంలో డయేరియా కేసులు నమోదు కావడంతో జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ శ్రీనివాసరావు గురువారం ఆ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వస్తుంటాయని, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. వేడి వేడి ఆహారం తీసుకోవాలని, చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రతించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, సర్పంచ్ బంక శ్రీను, కార్యదర్శి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు

వెంకోజీపాలెం, జూలై 18 : గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జీవీఎంసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కనున్న సర్వీసు రోడ్డుకు బారికేట్లు ఏర్పాటు చేశారు. అలాగే ఇక్కడి శివాలయం ఎదురుగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు.రోడ్డుపై ఉన్న బడ్డీలను వెనక్కి జరిపించారు. వెంకోజీపాలెం నుంచి సీతమ్మధార వరకు రోడ్లను శుభ్రం చేయడంతో పాటు గోతులను పూడ్చారు. డివైడర్లకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఎక్కడికక్కడ మంచినీరు అందించే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

ఆరిలోవ : చినగదిలిలో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న నార్త్ షిర్డీ సాయి బాబా ఆలయంలో గిరి ప్రదక్షిణ భక్తులకు పలు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ చీఫ్ ట్రస్టీ వానపల్లి అప్పారావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో 1995 నుంచి గిరి ప్రదక్షిణ భక్తులకు భోజనాలు, ప్రసాద వితరణ. మందుల పంపిణీ చేస్తున్నామని, ఈసారి కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

భీమునిపట్నం, జూలై 18 : చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించే హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈనెల 31 వరకూ గడువు పొడిగించినట్టు స్థానిక ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు తెలిపారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెలాఖరు వరకూ ఫీజు చెల్లించవచ్చునన్నారు. అలాగే విశారద, ప్రవీణ పరీక్షలకు అపరాధ రుసుము లేకుండా ఈనెల 25వ తేదీలోగా చెల్లించాలన్నారు.

ఘనంగా అనంత పద్మనాభుని శాంతి కల్యాణం

పద్మనాభం, జూలై 18 : పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయంలో అనంత పద్మనాభస్వామి శాంతి కల్యాణం వేద పండితుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక వేదికపై ఉభయ దేవేరులతో అనంతుడి ఉత్సవ విగ్రహాలను నిలిపి కల్యాణం జరిపించారు. విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన అవినాష్, రమ్య దంపతులు ఈ కల్యాణం చేయించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సీతారామాంజనేయస్వామి, వెంకటాచార్యులు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో పులి కలకలం

- అడవి పిల్లిగా అటవీ శాఖాధికారుల నిర్ధారణ

సాగర్‌నగర్, జూలై 18 : సాగర్‌నగర్ కాలనీలో గురువారం పులి కలకలం రేగింది. వేకువజామున 3 గంటలకు ఎల్ఐజీ-ఎ- గృహ సముదాయంలో నివాసం వుంటున్న ప్రసాద్ కాలకృత్యాలు తీర్చుకునేందుకుఇంటి ప్రధాన ద్వారం తలుపు తీసుకుని బయటకు వచ్చాడు. ఎదురుగా రోడ్డుపై పులి కనిపించిందని, భయపడి తిరిగి ఇంట్లోకి వెళ్లి తలుపు మాటు నుంచి చూసే సరికి రోడ్డు పక్కనున్న చెట్టు ఎక్కే ప్రయత్నం చేసిందని, చెట్టు ఎక్కలేక అక్కడి నుంచి సాగర్‌నగర్ వాటర్ ట్యాంకు వైపు వెళ్లినట్టు ఆయన తెలిపారు. వాటర్ ట్యాంకు దగ్గర రహదారిపై మార్నింగ్ వాక్ చేస్తున్న మహిళ కూడా తనకు పులి కనిపించిందని, భయంతో ఇంటికి పరుగు తీసినట్టు చెప్పింది. వారిద్దరూ స్థానికులకు చెప్పిన మాటలు సాగర్‌నగర్ కాలనీ మొత్తం దావానలంలా వ్యాపించడంతో అందరిలోనూ భయాందోళన నెలకొంది. దీంతో సాగర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి. శ్రీరామవర్మ, టీడీపీ నాయకుడు బి. దొరబాబు, రాజా, తదితరులు పులి సంచరించినట్టు చెబుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎల్ఐజీ ఎ గృహ సముదాయంలో ఉన్న పార్కులో పులిని పోలిన పాద ముద్రలు ఉన్నట్టు గుర్తించి, అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ ఎల్లారావు, సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్సు అధికారులు పార్కుకు చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. అవి పులివి కాదని, అడవి పిల్లి జాతికి చెందిన జంతువువని చెప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



పాద ముద్రలను పరిశీలిస్తున్న అధికారులు



పాఠశాల విద్యార్థులతో సీపీ శంఖబ్రత బాగ్చీ

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీపీ

పెదవాల్తేరు, జూలై 18 : యువత గంజాయి, మద్యం, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ బాగ్చీ సూచించారు.గురువారం ఆయన చినవాల్తేరులోని కోటక్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో డ్రగ్స్ మీద పోరాటంలో యువత పాత్ర చాలా ముఖ్యమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు అతి పెద్ద ముప్పు డ్రగ్స్ అని చెప్పారు. మాదక ద్రవ్యాల వాడకం చట్టరీత్యా నేరమని, డ్రగ్స్‌కి అలవాటు పడేవారు నేరాలు చేయడానికి కూడా వెనుకాడరని తెలిపారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు జనసేన అధ్యక్షురాలు ఉమ్మడి నందితారావు, స్కూల్ ప్రిన్సిపాల్ రేవ్, ఫాదర్ విజయ్ శేఖర్ పాల్గొన్నారు.

'బోటు ప్రమాద బాధితులను ఆదుకోవాలి'

భీమునిపట్నం, జూలై 18 : పూడిమడక తీరంలో ప్రమాదానికి గురైన ఫిషింగ్ బోటు యజమాని కుటుంబాన్ని, కళాసీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బోటు యజమాని దూడ దాసు భీమిలిలోని ఎగువపేటకు చెందిన వారని, ప్రమాదంలో సుమారు రూ. 40 లక్షల వరకూ నష్టం వాటిల్లిందన్నారు.

పిల్లలు కరెన్సీ నోట్లు చింపేశారని వ్యక్తి ఆత్మహత్య

గోపాలపట్నం, జూలై 18 : పిల్లలు కరెన్సీ నోట్లు చింపేశారని క్షణికావేశంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన చందన్‌కుమార్ (33) రైల్వేలో అసిస్టెంట్ లోకో పైలెట్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య లాల్ మున్నీకుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి కొత్తపాలెం గణపతినగర్‌లో ఐదేళ్లుగా నివసి స్తున్నారు. కాగా చందన్ కుమార్‌కు కోపం ఎక్కువ కావడంతో చిన్న విషయాలకే కోపోద్రేకానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి చందన్‌కుమార్ పిల్లలు ఆయన జేబులోని కొన్ని కరెన్సీ నోట్లను తీసి చింపేశారు. దీంతో ఆయన తీవ్రమైన కోపంతో తన గదిలోకి వెళ్లి క్షణికావేశంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎంతసేపటికీ భర్త గది తలుపులు తీయకపోవడంతో అనుమానంతో మున్నీకుమారి చుట్టుపక్కల వారి సాయంతో బలవంతంగా తలుపులు తెరిచి చూడగా చందన్‌కుమార్ ఉరి వేసుకుని ఉండడంతో గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి, ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చందన్‌కుమార్‌కు కోపం అధికమని, పిల్లలు అల్లరి చేసినా భరించేవాడు కాదని తెలిపింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ సురేశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌టీఎస్ నిర్వాసితుల సమస్యలపై వినతి

సింహాచలం, జూలై 18 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాసరావుతో పాటు అడివివరం గ్రామ మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, తదితరులు కలెక్టర్ హరీంద్ర ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీఆర్‌లు అందరికీ సమానంగా ఇవ్వాలని, దేవస్థానం, జీవీఎంసీతో ఇబ్బంది లేకుండా ఇళ్లు నిర్మించుకునే అవకాశం ఇవ్వాలని, నిర్వాసితులకు సింహాచలం గ్రామ పరిధిలోనే ప్రత్యేక లేఅవుట్ వేసి స్థలాలు కేటాయించాలని కోరారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

తోటగరువులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ, జూలై 18 : జీవీఎంసీ పదో వార్డు తోటగరువులో రూ. 40 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, టీడీపీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, పోలారావు, గాడు అప్పలనాయుడు, కేతా సత్యన్నారాయణ, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, రాజశేఖర్, ఏఈ వెంకటరావు పాల్గొన్నారు. కాగా తోటగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తన సొంత నిధులతో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో నోట్ పుస్తకాలు అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్, ఒమ్మి సన్యాసిరావు, పోలారావు, అప్పలరాజు, గాడి సత్యం పాల్గొన్నారు.

8వ వార్డులో జనసేన సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న పంచకర్ల సందీప్

ఎండాడ, జూలై 18 : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నాయకత్వంలో ప్రతిఒక్కరికి న్యాయం జరుగుతుందన్న భావన ఉండడంతో పార్టీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ అన్నారు, గురువారం ఆయన 8వ వార్డులోని ఎండాడ దసపల్లా లేఅవుట్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 28 వరకు సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామని, నియోజకవర్గం నుంచి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.అందుకనుగుణంగా నాయకులు, కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ 7వ వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు, 98వ వార్డు అధ్యక్షుడు మజ్జి సూరిబాబు, పోతిన అనురాధ, దేవర శివ, వి. అప్పారావు, భువనేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణమయ్య జయంతి



కృష్ణమయ్యకు నీరాజనాలిస్తున్న అర్చకుడు

సింహాచలం, జూలై 18 : వరాహలక్ష్మీనృసింహస్వామిపై వచన సంకీర్తనలు రాసి స్వయంగా సంగీత బాణీలు సమకూర్చి గానం చేసిన ప్రథమాంధ్ర వచన సంకీర్తనాచార్యులు కాంతా కృష్ణమాచార్యులు అని అప్పన్న ఆలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ అన్నారు. కృష్ణమయ్య జయంతి పురస్కరించుకుని అప్పన్న ఆలయంలోని బేడామండపంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృష్ణమాచార్యులు అన్నమయ్య, రామదాసు, ముత్తు స్వామి, దీక్షితార్ కంటే ముందుతరం వారని, ఇతర వాగ్గేకారులంతా వేలల్లో మాత్రమే సంకీర్తనలు రాయగా కృష్ణమయ్య సుమారు నాలుగున్నర లక్షల వచన సంకీర్తనలు రాశారని చెప్పారు. తన సంకీర్తనల గానం ఆషాడ మాస శుక్ల పక్ష ద్వాదశి నుంచి ప్రారంభించినట్టు ఆయన సంకీర్తనల్లో ఉందని, అందుకే ఏటా అదే రోజున కృష్ణమయ్య సంకీర్తనల జయంతి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం దేవాలయ ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు షోడశోపచరాలు పూజలు చేయగా స్థానాచార్యులు రాజగోపాల్ సంకీర్తనలు గానం చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ఆలయ ఏఈఓ నక్క ఆనందకుమార్, వేదపండితులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల్లో అక్రమ తవ్వకాలు పరిశీలన

భీమునిపట్నం, జూలై 18 : బీచ్‌రోడ్ ఎర్రమట్టి దిబ్బల్లో బిల్డింగ్ సొసైటీ జరిపిన అక్రమ తవ్వకాలను సీపీఎం నాయకుడు, 78వ వార్డు కార్పొరేటర్ డా.బి. గంగారావు, ఆ పార్టీ భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎర్రమట్టి దిబ్బల ప్రదేశంలో బిల్డింగ్ సొసైటీకి 373 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు ఏవిధంగా ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. అసలు ఈ వ్యవహారంలో కోర్టులో నడచిన కేసులు ఏమిటి ? వాటికి అధికారులు ఏవిధమైన నోట్‌లు పెట్టారు, తదితర వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

16వ బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం

కొమ్మాది, జూలై 18 : ఆరోగ్యంగా ఉంటేనే సక్రమంగా విధులు నిర్వహించగలరని, సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని బక్కన్నపాలెం 16వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు అన్నారు. గురువారం బెటాలియన్‌లో సిబ్బంది కోసం మెడికోవర్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి శారీరక దారుఢ్యం అవసరమని, ఇటువంటి వైద్య శిబిరాలు ఆరోగ్య పరిరక్షణకు అవసరమవుతాయని చెప్పారు. అనంతరం బెటాలియన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు జి. ఇళయసాగర్, దేవానంద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు

బిల్డింగ్ సొసైటీ తవ్వకాలపై విచారణ జరపాలి

తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్



విలేకరులతో మాట్లాడుతున్న రామ్


భీమునిపట్నం, జూలై 18 : వైసీపీ ప్రభుత్వ హయాంలో బీచ్ రోడ్‌లోని ఎర్రమట్టి దిబ్బల్లో అక్రమ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగాయని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో విలేరులతో మాట్లాడారు. తవ్వకాలు కేవలం 36 రోజులుగానే కొనసాగుతున్నాయని ఎర్రమట్టి దిబ్బల్లో ఒక సెల్ఫీ తీసుకుని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏడాదిన్నర క్రితం నుంచి అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయని ఆరోపించారు. వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్ కనుసన్నల్లో ఈ అక్రమాలన్నీ జరిగాయన్నారు. వారిద్దరూ ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, ముఖ్యంగా పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా ఎన్ని అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారో తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. అమర్‌నాథ్ ఎర్రమట్టిదిబ్బల్లో ఒక సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో తప్పుడు స్టేట్‌మెంట్‌తో పోస్టు చేసినంత మాత్రాన ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపితే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే మహిళల భద్రతకు భరోసా వచ్చిందని పేర్కొన్నారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మారోజు సంజీవ్‌కుమార్, గండిబోయిన పోలిరాజు, శ్రీనివాసరావు ఉన్నారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం అమ్మకం

భీమునిపట్నం, జూలై 18 : ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న కందిపప్పు, బియ్యం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భీమిలి ఇన్‌ఛార్జి ఆర్డీవో హుస్సేన్ కోరారు. బుధవారం ఆయన పాత బస్టాండ్ వద్ద ఉన్న పలివెల రాము కిరాణా దుకాణంలో, తగరపువలసలో గణేష్ థియేటర్ సమీపంలోని బీవీఆర్ ట్రేడర్స్ దుకాణంలోనూ కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా దుకాణాల్లో కందిపప్పు కిలో రూ.160లకు, బియ్యం కిలో రూ.49లకు విక్రయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోవింద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, డీఎస్‌వో సూర్యప్రకాష్, భీమిలి సీఎస్‌డీటీ శ్రీనివాసరావు, నాయకులు మారోజు సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, చౌక డిపో డీలరు వుశిరికల తాతాజీ, పాల్గొన్నారు.

పద్మనాభం (రూరల్) : రాష్ట్ర ప్రభుత్వం ధరల నియంత్రణలో భాగంగా రాయితీపై బియ్యం, కందిపప్పు అందిస్తుందని జిల్లా పౌర సరఫరా శాఖాధికారి సూర్యప్రకాష్ అన్నారు. ఆయన మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న మహిళా మార్టులో బియ్యం, కందిపప్పు విక్రయ ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కె. లక్ష్మీనాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, వెలుగు ఎంపీఎం ప్రభాకరరావు ఎంఆర్ఐ కోటేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వేములవలస పూల మార్కెట్ నుంచి శ్రీకాకుళం వెళ్లే జాతీయ రహదారిలో ఉన్న శ్రీ సూర్య ట్రేడర్స్‌లో రాయితీపై బియ్యం, కందిపప్పు అమ్మకాల ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. దీన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాష్, తహసీల్దార్ హేమంత్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొట్యాడ సూర్యారావు, షిణగం సురేష్, నాగేశ్వరరావు, పచ్చిపులుసు కనకారావు , తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో హుస్సేన్